

# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



శుక్రవారం 26 జూన్ 2026


## కలికిరిలో జోరుగా పేకాట

### స్పందించని పోలీసులు

**కలికిరి, జూన్ 25, ప్రభాతవార్త:**

కలికిరి మండలంలో గత కొద్ది రోజులుగా పేకాట రాయుళ్లు పెట్రేగి పట్టపగలే గ్రామాల సమీపానే పేకాట ఆడుతున్నా కలికిరి పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదని మండల ప్రజలు, మహిళలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ పేకాట వల్ల గ్రామాల్లో చోరీలు, చిన్న చిన్న ఘర్షణలు జరుగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రికుంటపల్లె పంచాయతీ, గజ్జలవాండ్లపల్లె సమీపంలో పట్టపగలే పేకాట ఆడుతున్నారు. రాత్రి 12 గంటల వరకు బయట ప్రాంతాల నుంచి ద్విచక్ర వాహనాలు పేకాట ఆడేందుకు వస్తున్నారని దీని వల్ల గ్రామాల్లో కొత్త వ్యక్తులు వస్తుండడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ పేకాటపై 112 సైతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మహిళలు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా పోలీసు అధికారులు స్పందించి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి పేకాట జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## చెరువులో అనుమతి లేకుండా మట్టి తరలింపు

### అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

**పీలేరు, జూన్ 25 ప్రభాతవార్త:**

ఎలాంటి అనుమతి లేకుండా చెరువులో మట్టి తరలించిన సంఘటన మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ సూరప్ప గారిచెరువులో చోటు చేసుకుంది. వివరాలు గురువారం సూరప్పగారిచెరువులో హిటాచి పెట్టి టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా గామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి తరలింపును అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చెరువుల్లో గానీ, ప్రభుత్వ స్థలాల నుంచి గానీ మట్టి తరలిస్తే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. అయితే కొందరు అక్రమ దారులు తమ ఇష్టాను సారం రెవెన్యూ అధికారుల కళ్లుకప్పి మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



మట్టిని తరలిస్తున్న దృశ్యం

## పులివెందులలో ప్రైవేట్ పాఠశాలలపై

# ఫిర్యాదుల వెల్లువ

**ఫీజులు.. పుస్తకాలు.. యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులపై భారం?**
**కనీస వసతులు, భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు**
**తనిఖీలు ఎప్పుడంటున్న తల్లిదండ్రులు**
**షిఫ్టింగ్ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న చర్యలు నిల్**
**అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నా చర్యలు లేవా ?**




**పులివెందుల, జూన్ 24 ,ప్రభాత వార్త :**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భద్రత, కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ప్రైవేట్ పాఠశాలల్లో కొన్ని చోట్ల నిబంధనల అమలు తీరుపై తల్లిదండ్రుల నుంచి ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నప్ప టికీ విద్యార్థులకు అవసరమై న ప్రాథమిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ పిల్లలకు మెరుగైన విద్య అందుతుందనే ఆశతో వేలాది రూపాయలు ఫీజుల రూపంలో చెల్లిస్తున్నామని, అయితే కొన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు సంతృప్తికరంగా లేవని వారు పేర్కొంటున్నారు.

**అదనపు ఫీజుల పేరుతో వసూళ్ల ఆరోపణలు**

కొన్ని పాఠశాలల్లో వివిధ పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. ఐఐటీ, ఒలింపియాడ్, ప్రత్యేక శిక్షణ వంటి పేర్లతో భారీ మొత్తాలు తీసుకుంటు న్నారని, వాటికి తగ్గట్టుగా బోధనా ప్రమాణాలు, సదుపాయాలు ఉన్నాయా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా యాజమాన్యాలు నిర్ణయించిన మొత్తాలను తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

**పాఠశాల పేరుతో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలా?**

పాఠశాలల వద్దే పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నారని, కొన్ని పుస్తకాలపై పాఠశాల పేర్లు ముద్రించి అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బయట మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వస్తువులను కొనుగోలు చేసే స్వేచ్ఛ తల్లిదండ్రులకు లేకుండా పోతోందని వారు చెబుతు న్నారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తాగునీరు, కనీస సౌకర్యాలపై అసంతృప్తి**

అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సరైన తాగునీటి సౌకర్యం కూడా లేదనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థులు ఇంటి నుంచే నీటి బాటిళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం ప్రాథమిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్న సమయంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి పరిస్థితులు కొనసాగడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**భద్రతా ప్రమాణాలపై ఆందోళన**

కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇరుకైన ప్రాంతాల్లో కొనసాగుతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులు సురక్షితంగా బయటకు వచ్చేలా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయా అనే అంశంపై తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, భవన అనుమతులు వంటి అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల ఆదేశాలు బేఖాతర్ చేస్తున్నా చర్యలు లేవా ?**

విద్యాశాఖ అధికారులు నిర్వహించే సమావేశాలకు కొందరు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాజరు కావడం లేదు అని అధికారులు చెప్పిన నిబంధనలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు సమావేశం హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చిన కొన్ని పాఠశాలలో మాత్రమే హాజరయ్యాయి మరి హాజరుకాని పాఠశాలలపై రెండు మూడు రోజులు గడిచిన మండల విద్యాశాఖ అధికారి 1 ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం పై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల విద్యాశాఖ అధికారులు కఠినంగా వ్యవహరించి నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**షిఫ్టింగ్ అనుమతి లేకుండా పాఠశాలల నిర్వహణ.**

పులివెందుల పట్టణంలో కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు షిఫ్టింగ్ అనుమతులు లేకపోయినా ఇష్టానుసారంగా పాఠశాలను నిర్వహిస్తున్న మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదులు వెళ్లిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. ఎక్సలెంట్ నాగార్జున పాఠశాల మూడు సంవత్సరాలుగా షిఫ్టింగ్ అనుమతులు లేకుండా ఇష్టానుసారం పాఠశాల నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఒకచోట అనుమతి పొంది రెండు చోట్ల పాఠశాల నిర్వహిస్తున్న ఎక్సలెంట్ నాగార్జున యాజమాన్యంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. భాష్యం విద్యాసంస్థలు కూడా షిఫ్టింగ్ అనుమతులు లేకుండానే పాఠశాల నిర్వహిస్తున్నారు. అనుమతి లేకుండా పాఠశాలలను నిర్వహించే సంస్థలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారిని విద్యావేత్తలు కోరుతున్నారు.

**ప్రమాదం జరిగిన తర్వాతే స్పందిస్తారా?**

ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన అగ్ని ప్రమాదం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు."ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి కాకుండా ముందుగానే పాఠశాలలను తనిఖీ చేయాలి. విద్యార్థుల భద్రత, తల్లిదండ్రులపై ఆర్థిక భారం, విద్యా ప్రమాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి" అని పలువురు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. పులివెందులలోని ప్రైవేట్ పాఠశాలల్లో సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పోతబోలులో పులి సంచారం

### అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు సూచనలు



**మదనపల్లి, జూన్ 25, ప్రభాతవార్త :**

పోతబోలులో పులి అంటూ పుకార్లు రావడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మదనపల్లె మండలం, పోతబోలు గ్రామపంచాయతీ పరిధిలోని (లోకల్ అథారిటీ) కొత్తగాండ్లపల్లి, పాండవుల బండ., పుదు కోట.,కొత్త గాండ్లపల్లె. తదితర సమీప ప్రాంతాల్లో పులి సంచారం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో గురువారం స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు.స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్ ఖాన్, సూదిళ్ళ సుధాకర్. వెంకటేష్, అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారుల,గ్రామ ప్రజలతో కలిసి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ ఎలాంటి అనుమానాస్పద కదలికలు లేదా పులి ఆనవాళ్లు కనిపించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం అత్యవసర సంప్రదింపు ఫోన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మదనపల్లె తహసీల్దారు కూడా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పులి సంచారం వార్తతో పోతబోలు, సీఎటీఎం పరిసర గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఒంటరిగా అడవి ప్రాంతాలు లేదా పొలాలకు వెళ్లవద్దు. రాత్రి వేళల్లో బయట సంచారం తగ్గించండి. గుంపులుగా మాత్రమే బయటకు వెళ్లండి. పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దు. పులి ఆనవాళ్లు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించండి. గతంలో కూడా పొన్నేటిపాలెం, చిప్పిలి సమీప ప్రాంతాల్లో పులి సంచారం నమోదైన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యంన్నారు.

## ఇషా గ్రామోత్సవం 2026 పోస్టర్లు ఆవిష్కరణ

### రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్

**మదనపల్లె, జూన్ 25 ప్రభాతవార్త :**

భారతదేశపు అతిపెద్ద గ్రామీణ క్రీడా సంబరాల్లో ఒకటైన 18వ ఇషా గ్రామోత్సవం 2026 పోస్టర్లను వైద్యఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతి కరస్పాండెంట్ సేతు, జిల్లా అధ్యక్షులు పులి నరేంద్రకుమార్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడానికి ఇషా గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. గ్రామీణ యువతకు ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా ఈ పోటీలు నిలుస్తాయన్నారు. ఈ గ్రామోత్సవ పోటీలను యువత పాల్గొని క్రీడాకారుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇషా గ్రామోత్సవం పోస్టర్లను ఆవిష్కరించి పోటీల విజయానికి ప్రోత్సాహం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బర్నేపల్లి రవికుమార్, డాక్టర్ జి.అజంతుల్లాఖాన్, డాక్టర్ బాబు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్

## లోపట్నూతలలో బాలిక

# అనుమానాస్పద మృతి

### నీళ్ల డ్రమ్ములో శవమై కనిపించిన నాలుగేళ్ల చిన్నారి

### పోలీసుల దర్యాప్తు ప్రారంభం

**పులివెందుల జూన్ 25 ప్రభాత వార్త :**

నియోజక వర్గ పరిధిలోని లింగాల మండల లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. గ్రామానికి చెందిన సృజన, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక (4) గురువారం నీళ్ల డ్రమ్ములో మృతిచెందిన స్థితిలో కనిపించింది. బాలికను ఎవరైనా హత్య చేసి నీళ్లలో పడవేశారా? లేక ప్రమాదవశాత్తు డ్రమ్ములో పడి ఊపిరాడక మృతి చెందిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 500 లీటర్ల సామర్థం గల నీళ్ల డ్రమ్ములో చిన్నారి మృతదేహం గుర్తించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న లింగాల ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాలిక తల్లిదండ్రులను విచారించి వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన చిన్నారి నిత్విక

## రుణాలు సక్రమంగా చెల్లించాలి

**దువ్వూరు, జూన్ 25, ప్రభాతవార్త:**

దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు తమ రుణాలను సక్రమంగా చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని అధ్యక్షుడు పోలు రామ్మోహన్ రెడ్డి, కార్యదర్శి రామ్మోహన్ లు తెలిపారు. గురువారం ప్రాథమిక సహకార సంఘం ఆవరణంలో వాయిదా మీరిన రుణాలపై సెక్షన్ 71 ప్రకారం విచారణ నిర్వహించారు. విచారణలో పాల్గొన్న రుణా బకాయి దారులు వాయిదాలకు సంబంధించి తక్షణమే చెల్లించి సంఘ క్రమశిక్షణకు తోడ్పడాలన్నారు. గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో సహకార చట్టం ప్రకారం రికవరీ ప్రక్రియను వేగవంతం చేస్తామని అలాగే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. రుణ గ్రహీతలు అందరూ స్వచ్ఛందంగా రుణ బకాయిలు చెల్లించి తిరిగి రైతులకు రుణాలు అందించేందుకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


**బి.టి. కాలేజీని కాపాడుకుందాం**

వార్త.. 2లో


## మదనపల్లెలో పర్యటించిన

# వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్

**మర్యాదపూర్వకంగా కలిసిన పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి**
**జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపాలని వినతి**

**మదనపల్లె, జూన్ 25 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో గురువారం రాష్ట్ర కుటుంబ ఆరోగ్య,వైద్యవిద్యాశాఖ మంత్రి సత్యకుమార్ పర్యటించారు. ఇందులో భాగంగా టిడిపి రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్,ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా)లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితుల గురించి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని, గతంలో దాదాపు 70 మంది వైద్యులు సేవలందించగా, ప్రస్తుతం కేవలం 24 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీని వలన మదనపల్లి నియోజకవర్గంతోపాటు, పరిసర గ్రామాల నుంచి చికిత్స కోసం వచ్చే వేలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రోగులను ఇతర ప్రాంతాలకు రెఫర్ చేసే ఘటనలు అధికంగా జరుగుతున్నాయని, ఐ.సి.యు విభాగం పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని ట్రామాకేర్ సేవలు కూడా ఆశించిన స్థాయిలో లేవన్నారు. ఆసుపత్రిలో పడకలు (బెడ్స్) అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించలేని పరిస్థితి నెలకొందని, ఇంకా పేద ప్రజలకు ఎంతో అవసరమైన మహాప్రస్థానం వాహనం కూడా అందుబాటులో లేకపోవడం వల్ల బాధిత కుటుంబ సభ్యులు మరింత ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించడం, మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుని మదనపల్లి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించవలసిందిగా వారు మంత్రికి అందించిన పత్రములో పేర్కొన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# ఖరీఫ్ కష్టమే




**నమ్మకం లేని వాన...**
**నష్టపోవడానికి సిద్ధపడని రైతు...!**
**ఎల్‌నినో సందిగ్ధంలో కర్షకులు**



ఏరువాక సాగక దర్శనమిస్తున్న బీడు భూమి

**చౌడేపల్లి, జూన్ 25 ప్రభాతవార్త**

మృగశిర కార్తె రాగానే తొలకరి జల్లు కురిసి ఏరువాక సాగే కాలమిది...కాడెద్దులు తోలుకెళ్ళి భూమాతకు పూజ చేసి దుక్కిలు దున్నే సమయమిది...మృగశిర పోయి ఆరుద్ర వచ్చినప్పటికీ ఏరువాక సాగలేదు...ఈ కాలం లో వేరుశెనగ విత్తనాలు వేసి రైతులందరూ ఆశగా ఆకాశం వైపు చూస్తుండేవారు...అయితే కర్షకుల్లో ఈ హడావిడి కనుచూపు మేరలో కనిపించలేదు. కనీసం ప్రభుత్వమందించే రాయితీ విత్తన శెనక్కాయలు సైతం కొనేందుకు కొందరు విముఖత చూపుతున్నారు...దీనంతటికీ ఎల్‌నినో ప్రభావమేనని వ్యవసాయ నిపుణులు తెలుపుతున్నారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావ నీడలు కమ్ము కొన్నాయి. వరుణుడి కటాక్షం ఎప్పుడు వుంటుందో, అసలు సాలీనా పడాల్సిన వర్షాలు కురస్తాయో లేదో తెలియని సందిగ్దంలో రైతాంగం కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమయినప్పటికీ వేరుశెనగ సాగు చేసేందుకు రైతులు తీవ్ర నిరాశక్తిని ప్రదర్శిస్తున్నారు. కాయలు కొని తెచ్చుకొంటే తీరా పొలంలో వేసిన తర్వాత ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవకపోతే పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఆలస్యం కావడం, ఈ యేడాది వర్షపాతం తగ్గవచ్చుననే వాతావరణశాఖ హెచ్చరికలు రైతుల్లో భయాందోళనను పెంచాయి. అంతే కాకుండా పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండల్లాల్లోనూ ఇప్పటి వరకు ఏరువాక సాగలేదు. ఖరీఫ్‌కు కష్టకాలమొచ్చిందంటూ కర్షకులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా విత్తన శెనక్కాయలకు ఈ కాలం మంచి గిరాకీ ..మిగతా 2వ పేజీలో

## న్యాయవాది పై దాడి అమానుషం

### న్యాయవాదుల ఆరోపణ

**రాయచోటి జూన్ 25 ప్రభాతవార్త**

న్యాయవాది పై దాడి చేయడం అమానుషం అంటూ కొందరు న్యాయవాదులు ఆరోపించారు. వివరాలలోకి వెళ్తే :అన్నమయ్య జిల్లా,రాయచోటి పట్టణంలోని, స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గురువారం సాయంత్రం 5.20 నిమిషాల ప్రాంతం లొ ఓ భూమి విషయమై స్థానిక ఆర్డీఓ కోర్టు నందు విచారణ నిమిత్తంలో రాయచోటి రూరల్ మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ అధ్యక్షులు మురికినాటి సుబ్బారెడ్డి కి వెతిరేకంగా వాదిస్తున్న న్యాయవాది చెవ్వాకుల రాజేష్ పై మురికినాటి సుబ్బారెడ్డి దాడి చేసినాట్లు భాధితుడైన రాజేష్ మరియు కొందరు న్యాయవాదులు పేర్కొన్నారు. దాడిలో రాజేష్ కు గాయాలై స్థానిక ఏరియా ఆసుపత్రి లో చికిత్స పొందు తున్నట్లు వారు తెలిపిరి. ఈ విషయమై మురికి నాటి సుబ్బారెడ్డి పై స్థానిక పోలిస్టేషన్ లో పిర్యాదు చేయనున్నట్లు వారుతెలిపారు.



## గోల్డ్ మైన్స్ పేరుతో రాయలసీమ ప్రజలను

# మభ్యపెడుతునన్న చంద్రబాబు

**రాయలసీమ అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులే శాశ్వత పరిష్కారం**
**జొన్నగిరి గోల్డ్ మైన్స్‌తో ప్రజలకు కంటే పెట్టుబడిదారులకే లాభం**
**వైసీపీ హయాంలో ప్రారంభమైన పనులను తన ఖాతాలో వేసుకుంటున్న బాబు**
**మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి**



**పులివెందుల ,జూన్ 25 , ప్రభాత వార్త :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి బహిరంగ సభలో కొత్త మార్పులు తీసుకొస్తున్నట్లు చెబుతూ రాయలసీమ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. జొన్నగిరి బహిరంగ సభలో గోల్డ్ మైన్స్ ద్వారా ఒక్క ఏడాదిలోనే రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నిజమైన అభివృద్ధి చెందాలంటే రాయలసీమ లిఫ్ట్ మిగతా 2వ పేజీలో

## బిఎల్వోలు సక్రమంగా విధులు నిర్వర్తించుకుంటే కఠిన చర్యలు తప్పవు తహసిల్దార్ శివకుమార్



పీలేరు, జూన్ 25, ప్రభాతవార్త: పీలేరు మండల పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్న బిఎల్వోలు పనులు సక్రమంగా నిర్వర్తించుకుంటే కఠిన చర్యలు తప్పవని పీలేరు తహసిల్దార్ శివకుమార్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో వారికి కేటాయించిన విధులను సక్రమైన పద్ధతిలో తప్పుల తడకలు లేకుండా తమ కర్తవ్యాన్ని పూర్తిచేయాలని ఎటువంటి అవకతవకలకు పాల్పడిన పేరులో మార్పులు చేర్పులు లో తప్పులు చేసిన ఇంటికి పంపించక తప్పదని తహసిల్దార్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రకారమే పనిచేయాలని తమకు ఇష్టం వచ్చినట్లు విధులు నిర్వర్తిస్తున్నట్లు కొంతమందిపై ఫిర్యాదులు వచ్చాయని అటువంటి వారిని గుర్తించడమే కాకుండా వారిపై కఠినమైన చర్యలు తీసుకునేందుకు ఉన్నత అధికారులకు సిఫారసు చేస్తామని ఆయన హెచ్చరించారు .వారికి అప్పగించిన పనులను సకాలంలో నిర్ణీత గడువు లోపల ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పూర్తిచేసి ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వెళ్లాలని తహసిల్దార్ అన్నారు.

## నూతన సి.ఐ.ని మర్యాదపూర్వకంగా కలసిన నాయకులు



పీలేరు జూన్ 25 ప్రభాతవార్త: పీలేరు పట్టణ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సి.ఐ.)గా బాధ్యతలు స్వీకరించిన అధికారిని గురువారం తెలుగు దేశం పార్టీ, మాలమహానాడు, పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన కమిటి, యం.అర్.పి.యస్, నాయకులు స్థానిక పీలేరు పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం మాలమహానాడు, యం.అర్.పి.యస్, నాయకులు మాట్లాడుతూ పీలేరు మండల పరిధిలో చట్టాన్ని గౌరవిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు నూతన సి.ఐ. ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ వర్గాల సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని,అణగారిన వర్గాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పీలేరు ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం,నేరాల నియంత్రణ కోసం పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం ఉంటుందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పీలేరు పట్టణంలో నేషనల్ హైవే నత్త నడకన జరుగుతున్న పనుల వల్ల రోజు, రోజుకు, జఠిలంగా మారుతున్న ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలని పీలేరు రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ ఆయనను కోరింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ దొడ్డిపల్లి నాయకులు కె. ఆనంద్ స్వామి,తెలుగుదేశం పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నగరినడుగు సుభాష్, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్,పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన కమిటి కన్వినర్ నడిమికండ్రిగ సుధాకర్ బాబు, మాలమహానాడు అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున,యం.అర్.పి.యస్.నాయకులు కిన్నెర తిమ్మయ్య, పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్లో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించండి

### ఫోర్డ్ డైరెక్టర్ లలితమ్మ



తంబళ్లపల్లె జూన్ 25 ప్రభాతవార్త ః తంబళ్లపల్లె మండలం లోని రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి తద్వారా పర్యావరణంతో పాటు మానవ మనుగడకు సహకరించాలని పోర్డు డైరెక్టర్ లలితమ్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రబీ సీజన్లో గుండ్లపల్లి రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి వేరుశెనగ, మొక్కజొన్న, మామిడి, కొర్రలు, సామలు, సజ్జలు, జొన్నలు, ఆకు కూరలు, కూరగాయలు పండించి అధిక దిగుబడి సాధించి సత్ఫలితాలు సాధించినట్లు చెప్పారు. మార్కెట్లో సైతం ప్రకృతి వ్యవసాయ పంటలపై ప్రజలు ఆసక్తి కనపరుస్తున్నారని మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించాలన్నారు. నేడు ప్రభుత్వం సైతం ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చి పలు రకాల సబ్సిడీలు ఇస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయమే పరమావధిగా చేసుకోవాలన్నారు. గుండ్లపల్లి ప్రకృతి వ్యవసాయ కేంద్రంలో తక్కువ ఖర్చుతో సేంద్రియ ఎరువులు, కషాయాల పై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆమె వెంట రమణ, వేట మల్లికార్జున, నరసింహులు, లక్ష్మన్న రైతులు ఉన్నారు.

## తంబళ్లపల్లెలో వైభవంగా పెద్ద పీరు మెరవణి



తంబళ్లపల్లె జూన్ 25 ప్రభాతవార్త తంబళ్లపల్లె మండల కేంద్రంలో మొహరం పండుగ సందర్భంగా గురువారం తెల్లవారుజామున పెద్ద పీరు మెరవణి కార్యక్రమం వైభవంగా జరిగింది. మొహరం పండుగలో భాగంగా హిందూ ముస్లిం సోదరులు ఐకమత్యంతో పెద్ద పీరుతోపాటు పీర్లను భారీ ఎత్తున పూలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక వాయిద్య బృందాలతో ఊరే గింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిగుండ ప్రవేశం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పాత బస్టాండ్ నుండి క్రాస్ రోడ్, సిద్ధారెడ్డిగారిపల్లి, సాలె వీధి, దేవళం వీధి, మసీదు వీధి, విశ్వనాథ వీధిలలో పేర్ల ఊరేగింపు నిర్వహించారు. పీర్లకు బాసికాలు సమర్పణ, చదివింపులు కార్యక్రమం లో వందలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగాస్థానిక రజకసంఘం సభ్యులు అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

## సమగ్రమైన వివరాలు అందించి ఓటుహక్కును కాపాడుకోవాలి



వాల్మీకిపురం, జూన్ 25 : ప్రభాతవార్త ఇండ్లవద్దకు వస్తున్న బీఎల్వోలకు ఓటర్లు సకాలంలో సమగ్రమైన వివరాలు అందించి ఓటు హక్కును కాపాడుకోవాలని స్థానిక తహసీల్దార్ పామిలేటి అన్నారు. గురువారం పట్టణంలోని నాయక్వీధిలో జరుగుతున్న గణన కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న పీలేరు నియోజకవర్గ తెదేపా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్బాషాను అభినందించారు ఓటర్ల వివరాల్లో తప్పులు లేకుండా సమగ్ర వివరాలను నమోదు చేసేందుకు కేంద్రప్రభుత్వం సర్ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. మండలంలో ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్ ల్వో మనుకు అందించే గణన పత్రులను అందుకుని సమగ్ర వివరాలతో వాటిని పూరించి అందజేయాలని సూచించారు. తెదేపానాయకుడు సయ్యద్బాషా మాట్లాడుతూ మన ఓటు హక్కును మనమే కాపాడుకుందామన్నారు. అనంతరం ఓటర్లుకు గణన పామ్స్ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు వెంకట్రమణ, చంద్రశేఖర్, తెదేపానాయకులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతను అధికమించిందుకే ఇండెక్స్ పొయ్యిలు



వాల్మీకిపురం, జూన్ 25 ప్రభాతవార్త : గ్యాస్ కొరతను అధికమించేందుకే ఇండెక్స్ స్టౌవ్లు (విద్యుత్తు పొయ్యిలు)ను చంద్రబాబు ప్రభుత్వం అంగన్వాడీలకు పంపిణీ చేస్తుందని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్, తెదేపా సీనియర్ నాయకులు వల్లిగట్ల వెంకట్రమణ, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ కోసూరి చంద్రమోళిలు అన్నారు. గురవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో సీడీపీవో భారతితో కలిసి అంగన్వాడీ కేంద్రానికి ఒక్కటి చొప్పున వాల్మీకిపురం ఐసీడీఎస్ పరిధిలో 175 ఇండెక్స్ స్టౌవ్లోను వారు అంగన్వాడీ టీచర్లకు పంపిణీ చేశారు. అంగన్వాడీకేంద్రాలు పిల్లల అభివృద్ధికోసం, సంపూర్ణ ఆరోగ్యం కోసమే పనిచేయాలన్నారు. సకాలంలో గ్రామాల్లో గర్భిణిలు, చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో భారతి, మండల పార్టీ అధ్యక్షుడు దామురెడ్డి, మాజీ సర్పంచి రాజేంద్రచారి, తెదేపానాయకులు పీవీనారాయణ, సయ్యద్బాషా, ఆనంద్, మురళి, అంగన్వాడి సూపర్వైజర్లు భానులక్ష్మి, రోహిణి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అవయువధానం పై విద్యార్ధులకు అవగాహన కార్యక్రమం

## డిప్యూటీ హెచ్.ఈ.ఓ. మహమ్మద్ రఫీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహమ్మద్ రఫీ

వాల్మీకిపురం జూన్ 25 ప్రభాతవార్త: అవయువధానం ద్వారా మరణానంతరం జీవితాలకు వెలుగు అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. గురువారం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం లోని ఎన్.టి.ఆర్. డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవయువధానం యొక్క ఆవశ్యకత, శరీరంలోని ఏ, ఏ అవయువాలు దానం చేయచ్చు వాటి పైన ఉన్న అపోహలు పైన మరియు జీవనసైలీలో మార్పులు పైన అవగాహన కల్పించి అధ్యాపకులతో కలసి కరపత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుచు ప్రతీ సంవత్సరము జూన్ 25న అవయవదాన మార్పిడి దినోత్సవం నిర్వహించడం జరుగుచున్నదని అవయవదానం పైన అవగాహన ప్రజల్లో కల్పించి అవయువధానం కోసం ఎదురుచూస్తున్న వారిలో ఆశలు చిగురింపచేయడం అవసరం అన్నారు. ముఖ్యంగా మనిషి సజీవంగా ఉన్నపుడు, బ్రతికి లేనపుడు అవసరం ఐన రోగులకు తమ అవయువాలు దానం చేయడాన్ని అవయువధానం అంటారు. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, కిడ్నీ, ఎముక, క్లోమ గ్రంధి, చర్మం, కనజాలాలు, కంటి కార్నియ దానం చేయచ్చుమెదడు మరణం చెందిన వ్యక్తి ద్వారా ఏనిమిది మందికి ప్రాణధానం చేయవచ్చును. మనదేశంలో ప్రతీ సంవత్సరము వేలాది మంది అవయువధానం కోసం ఎదురుచూస్తున్నారు. కాని అవయవ దాతలు తక్కువ.అందుకే అవగాహన పెరిగితే ఈ సమస్యను కొంతవరకు అధిగమించవచ్చును. అపోహలు వీడాలి. అవయవదానం వల్ల శరీరానికి అవమానం జరుగుతుంది అనేది కేవలం అపోహ. అవయువధానం అనంతరం శరీరాన్ని గౌరవప్రదంగా బంధువులకు అప్పగిస్తారు..మీ నిర్ణయం మరొకరి జీవితాన్ని కాపాడుతుంది. ఈ సంవత్సరము తీమ్ "ప్రాణాలను కాపాడండి చిరస్థాయిగా ఉండే వారసత్వన్ని అందించండి. "కావున యువత, సమాజం అవయువధానం పైన మరింత అవగాహన పెంచుకుని ముందుకు రావాలని అలాగే మంచి ఆరోగ్యానికి చక్కటి జీవనశైలిని పాటించి ఆయుస్సు పెంచుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎన్.ఎస్. ఎస్. కోఆర్డినేటర్ జ్యోతి, అధ్యాపకులు ప్రవీణ్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బి.టి. కాలేజీని కాపాడుకుందాం

## బహుజన యువసేన నాయకులు



మదనపల్లి జూన్ 25 ప్రభాతవార్త బీటీ కళాశాలను కాపాడుకుందాం, తొలగించిన కోర్సులను వెంటనే పునరుద్ధరించా లంటూ బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ కాలేజీ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనపల్లె పట్టణంలో ఎంతో చారిత్రాత్మకమైన నేపథ్యం కలిగిన బి.టి. కాలేజీని గత వైభవాన్ని గుర్తుచేసేలా అభివృద్ధి చేయాలని, రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ విద్యాసంస్థను వాడుకోవడం మానుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీ దుస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం బి.టి. కాలేజీని ప్రభుత్వ కాలేజీగా మారుస్తున్నట్లు జీవో విడుదల చేసి, సంబరాలు చేసుకున్నారే తప్ప నేటికీ ఆ జీవో అమలు కాలేదు. ప్రస్తుతం ఈ కాలేజీ అసలు ప్రభుత్వ ఆధీనంలో ఉందా లేదా ఎయిడెడ్ పరిధిలో ఉందా అనే కనీస స్పష్టత లేకుండా పోయింది,విద్యార్థులకు అన్యాయం గత ప్రభుత్వ హయాంలో ఈ కాలేజీ నుండి అనేక కీలకమైన విద్యా కోర్సులను తొలగించారు. మదనపల్లిలో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఉంది, కానీ అబ్బాయిల చదువుల కోసం ఒక్క ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా లేదు. అబ్బాయిలకు ఉన్న ఏకైక దిక్కు బి.టి. కాలేజీ మాత్రమే. అలాంటి కాలేజీని సరైన నిర్వహణ లేకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తొలగించిన అన్ని కోర్సులను తిరిగి ప్రవేశపెట్టాలి. కాలేజీకి పూర్వ వైభవాన్ని, ఖ్యాతిని తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలి" అని పునీత్ కుమార్ హెచ్చరించారు. లేనిపక్షంలో విద్యార్థులు, యువతతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

### మాజీ ఐఏఎస్ విజయ్కుమార్



మదనపల్లె, జూన్ 25 ప్రభాతవార్త : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని మాజీ ఐఏఎస్ విజయ్కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సిఎస్ఐ కమ్యూనిటీ హాలులో ఎస్సీ క్రైస్తవుల ఆత్మగౌరవ సభ బహుజన సేన మూడవ వార్షికోత్సవం సందర్భంగా శ్రీచందు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఐఏఎస్ లిబరేషన్ కాంగ్రెస్పార్టీ అధ్యక్షులు విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులు ఏకమవ్వాలని రాజ్యాంగ వ్యతిరేక శక్తులను రెండు రాష్ట్రాల్లో దళిత క్రైస్తవ సమాజంలో ఏర్పడిందని తెలిపారు. 1950 రాష్ట్ర ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని కేంద్రం ఏర్పాటు చేసిన బాలక్రిష్ణన్ కమిటీ నివేదిక రాకుండా తీర్పు ఇవ్వడం అహితుకమని క్రిష్టియన్ సమాజాన్ని అవమానించడమే అని తెలిపారు. పిటిఎం శివ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు రాజ్యాంగ బద్ద పదవిలో ఉండి క్రిస్టియన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రఘురాం క్రిష్ణంరాజుపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యమలా సుదర్శనం, పిటిఎం శివప్రసాద్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రవి మాదిగ, సిపిఐ క్రిష్ణప్ప, క్రిస్టియన్ పాస్టర్స్ భక్త అబ్రహమ్, రాజు, మీరాకుమారి, రతీస్ వెంకటేష్, హరిరెడ్డి, మనీ, ప్రకాష్, అశోక్, శ్యామ్ యువతి యువకులు పాల్గొన్నారు.

## బాహుదాలో శివాజీ విగ్రాహావిష్కరణను అడ్డుకుంటాం

### వీఆర్పీఎస్ నాయకులు హెచ్చరిక

మదనపల్లె, జూన్ 25 ప్రభాతవార్త : బాహుదా ప్రాంతంలో వాల్మీకి విగ్రహం వెనుక శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వీఆర్పీఎస్ రాష్ట్రయ వాల్మీకి ధర్మ సమాజ్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని ఉన్నతాధికారులు నిలిపివేయకపోతే విగ్రహావిష్కరణను అడ్డుకండుటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశ చరిత్రలో గొప్ప యోదుడని ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం మాకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మహర్షి వాల్మీకి విగ్రహం వెనుక భాగంలో మరో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం మహర్షి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమే అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఆపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి వివాదాస్పద విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిలిపివేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.



నిరసన తెలుపుతున్న వాల్మీకులు

## పల్స్పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### వైద్యాధికారిణి కావ్యగంధ

కలికిరి, జూన్ 25, ప్రభాతవార్త: మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఈనెల 28వ తేదీ ఆదివారం జరగనున్న జాతీయ పోలియో టీకా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మేడికుర్తి వైద్యాధికారిణి కావ్యగంధ పిలుపునిచ్చారు. గురువారం వైద్యాధికారిణి మాట్లాడుతూ మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిదిలో 5568 మంది చిన్నారులు ఉన్నారన్నారు. వారికి పల్స్పోలియో చుక్కలు వేసేందుకు 35 బూతులు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారిణి పేర్కొన్నారు. కార్యక్రమంలో 0-5 సం లోపు పిల్లలకు 2 పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యాధికారిణి కోరారు. ఇప్పటికే పల్స్పోలియో కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

## కెసిపల్లె గ్రామ పంచాయతీలో ముమ్మరంగా ఓటరు నమోదు



రామసముద్రం జూన్ 25 ప్రభాతవార్త అన్నమయ్య జిల్లా మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్ రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ ఇంచార్జి నిసార్ అహ్మద్ ఆదేశాలతో రామసముద్రం మండలం ఎంపిపి రమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కేసీ పల్లె గ్రామ పంచాయతీలో (సర్) ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు,ఎంపిపి రమణారెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమాన్ని ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత తప్పని సరిగా ఓటరు జాబితాలో తనపేరుని నమోదు చేసుకోవాలని, ఓటరు జాబితా ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీలోని పలు గ్రామాలను సందర్శించి ప్రజలు సమస్యలు, ఓటరు సర్ నమోదు సంబంధిత సందేహాలను తెలుసుకుని,అవసరమైన సూచనలు అందించారు, ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి,కెసి పల్లె గ్రామ పంచాయతీ వైసీపీ నాయకులు ఈశ్వర్ రెడ్డి,మాజీ ఎంపిటీసీ వెంకటరమణ, ఎం వెంకటరమణ,ఖారీష, మణి ప్రజలు పాల్గొన్నారు.

## పండ్లతోటల పెంపకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

వాల్మీకిపురం, జూన్ 25 ప్రభాతవార్త: ప్రభుత్వం అ0దిస్తున్న పండ్లతోటల పెంపకం రాయితీని అర్హత ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో మురళి అన్నారు. గురువారం మండలంలోని పత్తేపురంలో పౌండేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ఏపీవో పండ్లమొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రాంభించారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద మండలంలో 200 ఎకరాల్లో ప్లాంటేషన్ (పండ్లతోటల పెంపకం) కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ తోటల పెంపకం రాయితీని రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఉపాధిహామీ కార్యాలయాన్ని రైతులు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు విజయకుమార్రెడ్డి, వెంకట్రమణ, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాపుల ద్రోహి వైఎస్సార్సీపీ

### అన్నమయ్య జిల్లా బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండికోట సుధాకర్



రాయచోటి, జూన్ 25, ప్రభాతవార్త: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నాయకత్వంలో రాయచోటి నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం లభిస్తోందని అన్నమయ్య జిల్లా బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండికోట సుధాకర్ అన్నారు.మంత్రి రాంప్రసాద్ రెడ్డి కుల, మతాలకు అతీతంగా సామాన్య కార్యకర్తలను గుర్తించి రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవులు కల్పించడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. గతంలో గుర్తింపు లేకుండా పనిచేసిన అనేక మంది కార్యకర్తలకు ఇప్పుడు బాధ్యతలు, గౌరవం దక్కుతోందని పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని 6 మండలాల గాను రాయచోటి,లక్కిరెడ్డిపల్లి మండలాలకు టిడిపి మండల అధ్యక్షులుగా కాపు కులస్తులను ఎంపిక చేసి రాయచోటిలోనే బలిజ కులస్తులకు సముచిత స్థానం కల్పించిన ఘనత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కే దక్కిందన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్పై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని గండికోట సుధాకర్ అన్నారు. ప్రజల మద్దతుతో ఎన్నికైన నాయకులపై వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలపై ఉండాలే గానీ వ్యక్తిగత దూషణలు, సామాజిక వర్గాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు తగవని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతోందని, ప్రజలు కూడా అదే దిశగా ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్పై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా గట్టిగా ఖండిస్తామని గండికోట సుధాకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాపు నేతలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి అపూర్వ స్వాగతం

### వైకాపా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కిషోర్ కుమార్ రెడ్డి



తంబళ్లపల్లె జూన్ 25 ప్రభాతవార్త తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డికి మండలంలోని కోసువారిపల్లి, పీటీఎం మండలం మద్దయ్యగారిపల్లితో పాటు పలు మారుమూల గ్రామాలలో ప్రజలు అపూర్వ స్వాగతం పలికినట్లు వైకాపా యువజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ కిషోర్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే ప్యాయలవారిపల్లిలో నల్లపరెడ్డి దాయాదుల గుడి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు, ప్రజలతో మమేకమై సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముత్రవారి పల్లెలో కృష్ణారెడ్డి తండ్రి మృతిపై ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తదుపరి పెద్ద తిప్ప సముద్రం మండలం మద్దయ్యగారి పల్లి ఎంపీటీసీ ఖాదర్ వల్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలున్న కార్యకర్తలు తన దృష్టికి తేవాలని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైకాపా కార్యకర్తలకు అండగా నిలవడంతోపాటు వారి కష్ట నష్టాలలో పాలుపంచుకొని చేయూతనిస్తానన్నారు. వైకాపా పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేపట్టామని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైకాపా నాయకులు, కార్యకర్తలు గతంలో నియోజకవర్గంలో మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఆయన వెంట ఎంపీపీ శ్యామల కోటిరెడ్డి, ఎర్రగుండ్లపల్లి శివారెడ్డి, మండల వైకాపా అధ్యక్షుడు చౌడేశ్వర, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మభ్యపెడుతునన్న చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ఇరిగేషన్, హంద్రీనీవా వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీటి వనరుల ద్వారానే రైతులు, ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.జొన్నగిరి గోల్డ్ మైన్స్ వల్ల పెట్టుబడిదారులకు తప్ప సామాన్య ప్రజలకు పెద్దగా ప్రయోజనం ఉండదని ఆయన ఆరోపించారు. దీనికి ఉదాహరణగా కర్ణాటకలోని హట్టి గోల్డ్ మైన్స్ను ప్రస్తావిస్తూ, ఎన్నో ఏళ్లుగా గోల్డ్ మైనింగ్ జరుగుతున్నా అక్కడి ప్రజల జీవన ప్రమాణాల్లో ఆశించిన మార్పు రాలేదన్నారు.జొన్నగిరి మైనింగ్ పనులు వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని, ఇప్పుడు వాటిని తానే ప్రారంభించినట్లు చెప్పుకోవడం సరికాదన్నారు. గోల్డ్ మైనింగ్లో ఎంత నిల్వలు ఉన్నాయి, ఎప్పుడు ఉత్పత్తి ప్రారంభమవుతుంది వంటి వివరాలు చెప్పకుండా వైసీపీపై విమర్శలు చేయడం డైవర్షన్ రాజకీయాలకు నిదర్శనమన్నారు. లక్ష కోట్ల రూపాయల ఖర్చు చేసి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రాయలసీమను హార్టికల్చర్ హబ్గా అభివృద్ధి చేస్తామని గతంలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీ హయాంలో ప్రాజెక్టుల్లో నీటిని ముందుగానే నిల్వ చేయడంతో ప్రస్తుతం రైతులకు కొంతమేర సాగునీటి సౌకర్యం అందుతోందన్నారు. రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలు మామిడి సాగుకు ప్రసిద్ధి అని, నీటి కొరత కారణంగా వేల ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ ఉచితంగా మామిడి మొక్కలు పంపిణీ చేయడంతో సాగు విస్తరించిందని గుర్తు చేశారు.పులివెందుల మెడికల్ కళాశాల పనులను పూర్తి చేసి ప్రారంభించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదని, ప్రజా సమస్యలపై వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రాయలసీమ అభివృద్ధికి కృషి చేయాలని చంద్రబాబు ప్రభుత్వానికి సూచించారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఖరీఫ్ కష్టమే

మొదటి పేజీ తరువాయి

వుండేది. ప్రభుత్వ కార్యాలయాలు రైతులతో నిండిపో యేవి. వీటన్నంటినీ మించి ఇటీవల వ్యవసాయశాఖాధికారులు ఆరుతడి పంటలపై అవగాహన కల్పిస్తూ, ఈ దఫా ఖరీఫ్లో వేరుశెనగకు దూరంగా వుండటంటూ పరోక్ష సంకేతాలిస్తున్నారు. వర్షాలు ఈ సారి దోబూచులాడుతాయనీ, బోర్లలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలుపుతున్నారు. దీర్ఘకాలిక పంటలపై కాకుండా స్వల్పకాలిక పంటలపై దృష్టి సారించి నీటిని ఆదాయం చేయాలని పలుపునిస్తు న్నారు. దీంతో రైతుల్లో ఎల్నినో కలవరం పట్టుకొంది. ఎక్కడ చూసిన దుక్కిళ్ళతో కనిపించే భూములు బీళ్ళుగా దర్శనమిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ఖరీఫ్ ప్రధాన పంట అయిన వేరుశెనగ వేసేందుకు నిరాసక్తత చూపుతున్నారు. ఇలాంటి ఎల్నినో పరిస్థితుల్లో రైతులకు సరైన అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ ప్రణాళికలను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వుందని పలువురంటున్నారు.

## సర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

### వైకాపా ఇన్చార్జ్ నిస్సార్అహ్మద్



జేసికి విన్నవిస్తున్న నాయకులు

మదనపల్లె, జూన్ 25 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై వివిద రాజకీయ పార్టీల ప్రతినిదులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో వైకాపా మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్అహ్మద్, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్బంగా నిస్సార్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకమరాం బిఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా ఎన్యూమరేషన్ నిర్వహించాల్సి ఉండగా బిఎల్ఓలు కొందరు ప్రజలను సచివాయాలకు పిలిపించి ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. జియో ట్యాగింగ్ విధానాన్ని అమలు చేస్తే సర్వే ఇంటివద్దనే జరిగినట్లు నిర్ధారించుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతులు, కూలీలు ఇంటివద్ద లేకుండా పనుల్లో ఉంటారని వారికి అనుకూలమైన సమయంలో సర్వే నిర్వహించాలన్నారు. ఎన్నికల జాబితాల పరిశీలనలో కీలకమైన జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని వివిఎస్.రెడ్డి కోరారు. తద్వారా రాజకీయ పార్టీలు కూడా జాబితాలను పరిశీలించి నిజమైన ఓటర్ల హక్కులు పరిరక్షించేందుకు సహకరించే అవకాశం ఉటుందన్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులో పాటు గ్రానైట్ మహేష్ కలరు.


## పొరుగు సేవల ఉద్యోగ ప్రకటన

కడప జిల్లా నందు పోరుగు సేవల పద్ధతిలో పనిచేయుటకు ఈ క్రింద తెలిపిన సిబ్బంది కావలెను 1) 132 KVSS C Oramopadu High Skilled : 1 No Sc (W) నిబంధనలు: వయసు 18 నుండి నుండి 35 సంవత్సరముల ప్రకటన తేదీ దినము వరకు 2) అభ్యర్థులను పూర్తిగా మెరిట్ ఆధారంగా తీసుకొనబడును. 3) అభ్యర్థులను మండల, రెవెన్యూ జిల్లా ప్రాతిపదికన ప్రాధాన్యత క్రమంలో పరిశీలించబడును 4) అభ్యర్థులు 132 కె.వి విద్యుత్ ఉపకేంద్రం నందు ఏ మేరకు విధులు నిర్వర్తించగలరు అన్న నిర్ణయం తీసుకొనుటకు మరియు వారిని ఎంపిక చేయుటకు లేదా తిరస్కరించుటకు గాని కాంట్రాక్టర్ వారికి పూర్తి అధికారం ఉండును 5) పైన తెలిపిన ఖాళీలు తాత్కాలికం మాత్రమే వాటిని భర్తీ చేయుటకు గాని, మార్పు చేయుటకు గాని,పూర్తి రద్దు చేయుటకు గాని అధికారం ఉండును 6) అభ్యర్థులు వారి బయోడేటా తమ ధ్రువీకరించిన విద్యార్హత పత్రాలతో పాటు ఆధార్ కార్డు తమ సంబంధిత తాసిల్దారు వారిచే ఆరు నెలల లోపు జారీ చేయబడిన కుల మరియు నివాస ధ్రువీకరణ పత్రాలు జత చేయవలెను 7) కవర్ పైన ఏ ఉద్యోగమునకు ఏ విద్యుత్ ఉపకేంద్రం నాకు దరఖాస్తు చేయుచున్నారు కనపరుస్తూ షీల్డ్ కవర్ ద్వారా MANAGING DIRECTOR S.N CONSTANTS D/No: 38/172-3-124 Pratap Co-operative Colony, buddhapalli, Kadapa 516002 A.P., 29.06.2026వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటల లోపల దరఖాస్తులు చేరవలెను సమయం దాటి వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబడవు ముఖ్య గమనిక: సర్టిఫికెట్లు జతపరచని, పై నిబంధనలు పాటించని దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవు.

Managing Director
SN CONSTRUCTIONS, KADAPA

జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్)

## ఉపాధ్యక్షుడిగా కొప్పరపు వెంకట సుధాకర్

ముద్దనూరు, జూన్ 25 (ప్రభాతవార్త):

ముద్దనూరుకు చెందిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పరపు వెంకట సుధాకర్‌ను కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు నియామక పత్రాన్ని అందజేసి, ముద్దనూరు మండల ఆర్యవైశ్య సంఘ కమిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కొప్పరపు వెంకట సుధాకర్, తనపై ఉంచిన నమ్మకానికి జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా AISB 76వ ఆవిర్భావ దినోత్సవం




ఎడ్యుకేషన్ జూన్ 25 ప్రభాతవార్త :

అఖిల భారత విద్యార్థి బ్లాక్ 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కడప నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా AISB జాతీయ కన్వీనర్ జయవర్ధన్ సంస్థ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ కన్వీనర్ జయవర్ధన్, రాష్ట్ర అధ్యక్షుడు సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ నిర్మూలన, విద్యార్థులకు మెరుగైన హాస్టల్ వసతులు, స్కాలర్‌షిప్‌లు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జూన్ 25 నుండి జూలై 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు, చైతన్య సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అఖిల్, సగిలి చిరంజీవి, కిరణ్, భరత్, సమీర్, నితీష్ మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్)
## మహిళ అధ్యక్షురాలుగా రాజా వెంకట వరలక్ష్మి

ప్రొద్దుటూరు జూన్ 25 ప్రభాతవార్త

జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ మహిళ అధ్యక్షురాలుగా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన రాజా వెంకట వరలక్ష్మిని నియమించినట్లు కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులు వల్లంపండు వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ప్రొద్దుటూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ఆయన మరియు జిల్లా కమిటీ సభ్యుల చేతుల మీదుగా ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. నూతన కమిటీ అధ్యక్షురాలుగా ఎంపికైన రాజా వెంకట వరలక్ష్మిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్ పర్సన్ గుండా పద్మనాభయ్య, గౌరవ అధ్యక్షులు మల్లేముల సుబ్బరాయుడు, వైస్ ప్రెసిడెంట్ జయం సురేష్ బాబు, పందిటి సుబ్బారావు, ఈసీ సభ్యులు పద్మావతి దేవి, వరలక్ష్మి, అమ్మవారి శాల కార్యవర్గ సభ్యులు, మేడా వెంకటేశ్వర్లు, కడప జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు గాజులపల్లి హరి గోపాల్, మండల సంఘం అధ్యక్షులు దొంతు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రంను శాంతియుతంగా నిర్వహించాలి



వేంపల్లె జూన్ 25 ప్రభాతవార్త

మొహర్రం పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలను నిర్వహించాలని వేంపల్లె సీఐ నరసింహులు సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో మత పెద్దలు, నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులతో సీఐ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మొహర్రం వేడుకల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఊరేగింపులు మరియు ఇతర కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా నిర్వాహకులు సహకరించాలని కోరారు. ప్రజలందరూ పరస్పర సహకారంతో, సామరస్య వాతావరణంలో మొహర్రం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. పండుగ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో విజయసాగర్ భేటీ

నందలూరు, జూన్ 25 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు ఎద్దుల విజయసాగర్ తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని విజయసాగర్ వివరించగా, కూటమి ప్రభుత్వ పనితీరును రామచంద్రరావు ప్రశంసించినట్లు తెలిపారు.

## మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు, జూన్ 25 ప్రభాతవార్త :

మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పరిధిలో పనిచేస్తున్న పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కేవీఎస్ రామకృష్ణారెడ్డి తెలిపారు. నందలూరు, వనిపెంట, తొండూరు బాలికల పాఠశాలలు, కమలాపురం, జమ్మలమడుగు బాలుర పాఠశాలల్లో ఖాళీలు ఉన్న కేటగిరీలకు చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు రెండు సంవత్సరాల స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ప్రతులు, రెండు ఫోటోలతో సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం



తంబళ్లపల్లె జూన్ 25 ప్రభాతవార్త :

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, డ్వామా పిడి వెంకటరత్నం ఆదేశాల మేరకు తంబళ్లపల్లె మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల మొక్కలు నాటే. కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురువారం మండలంలోని పంచాలమర్రి పంచాయతీలో రైతు విశ్వనాథరెడ్డి కి చెందిన ఐదు ఎకరాల పొలంలో మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏపీఓ అంజనప్ప, ఈసీ మహేష్, టిఏ సుజాత లు పూజ చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ మండలంలో 160 ఎకరాలలో పండ్ల తోటలు పెంపకానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యంగా కొబ్బరి చెట్లు పెంపకం పై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఒక్కో రైతుకు 20 కొబ్బరి మొక్కలు నాటాలని సూచించారు. అదేవిధంగా మామిడి, నేరేడు, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, సపోటా పండ్ల మొక్కలు నాటుకోవచ్చున్నారు. మండలంలోని రైతులకు ఎన్ని ఎకరాలైనా పండ్ల మొక్కల పెంపకానికి సహకరిస్తామని చెప్పారు. అదేవిధంగా జలధారజల హారతి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నీటి సంరక్షణ పనులు వేగవంతం చేస్తున్నామని ఈనెలాఖరకు జలధార పనులు పూర్తి చేయడానికి ఉపాధి హామీ అధికారులను పురమాయించినట్టు చెప్పారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు నరసింహులు, వేమనారాయణ, ఉపాధి కూలీలు, రైతులు పాల్గొన్నారు.

# సాయి కృష్ణ మరణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలి

ప్రొద్దుటూరు జూన్ 25 ప్రభాతవార్త

సాయి కృష్ణ కస్టోడియల్ మరణం పై తక్షణమే సిబిఐ విచారణకు ఆదేశించాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసు దర్యాప్తు తీరుపై పలు సందేహాలు వ్యక్తం చేశారు. సాయికృష్ణపై రెండు నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరిచారా లేదా అనే అంశంపై స్పష్టత లేదన్నారు. మార్కాపురంలో ఉన్న సాయికృష్ణను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకు వచ్చిన తర్వాత ఏమి జరిగిందనే విషయమై ఇప్పటికీ అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. హైకోర్టులో తొలుత పోలీసులు సాయికృష్ణను అరెస్టు చేయలేదని చెప్పడం, అనంతరం కేసు మలుపు తిరగడం పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. సాయికృష్ణ తల్లి ఆవేదన వ్యక్తం చేయడంతో పాటు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన తర్వాతే ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశ మైందన్నారు. అనంతరం రాజకీయ, సామాజిక వర్గాల జోక్యంతో కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుందని చెప్పారు. కేసు రిమాండ్ నివేదికలో కేవలం సీఐ నాగరాజు పేరు మాత్రమే చేర్చడం ఆశ్చర్యకరమని, ఆయనకు సహకరించిన ఇతరుల పాత్రపై కూడా విచారణ జరగాల్సి ఉందన్నారు. మృతదేహం ఎక్కడ, ఎలా లభించింది, మరణానికి కారణమైన పరిస్థితులు ఏమిటి, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటి అనే అంశాలపై స్పష్టత లేదని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ కాకుండా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయ పడ్డారు. సీబీఐ దర్యాప్తు ద్వారా సూత్రధారులు, పాత్రధారులు ఎవరో బయటపడి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 29న కోర్టులో జరిగే విచారణ సందర్భంగా పూర్తి నిజాలు వెలుగులోకి రావాలని ఆశిస్తున్నామని తెలిపారు. సాయికృష్ణ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## ప్రభుత్వ నిబంధనలను
## తుంగలో తొక్కి ఎస్ఐఆర్ సర్వే నిర్వహణ



బద్వేలు, జూన్ 25,, ప్రభాతవార్త

ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) సర్వేను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ ఆరోపించారు. గురువారం బి.కోడూరు మండల కేంద్రంలోని ఎండీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాల్సిన అధికారులు ప్రజలను ఒకేచోటకు పిలిపించి రచ్చబండ కార్యక్రమంలా సర్వే నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఓటర్లకు దరఖాస్తు ఫారాలు అందించి, అవసరమైన పత్రాలను సచివాలయాల్లో సమర్పించాలని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. దీంతో ప్రజలు తమ పని దినాలను కోల్పోయి, ఏ పత్రాలు సమర్పించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం డప్పిలమ్మ గుడి నుంచి ఐత్రంపేట వరకు బద్వేలు–పోరుమామిళ్ల ప్రధాన రహదారి వెంట అక్రమణకు గురైన భూములను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. ఈ భూములను స్వాధీనం చేసుకోవాలని ఇటీవల ఆర్డీవో, తహసిల్దార్లకు వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె. జకరయ్య, బి. అనిల్, మండల కార్యదర్శి మార్క్, నాయకులు రమణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో
## పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

బద్వేలు అర్బన్ , జూన్ 25, ప్రభాతవార్త

బద్వేల్ పురపాలక సంఘం పరిధిలోని గురుకుల పాఠశాలను మున్సిపల్ కమిషనర్ యం. కృష్ణ సందర్శించి విద్యార్థులకు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణతో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి ఇంటిలో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని వివరించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, స్వచ్ఛమైన పరిసరాల కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహకరించాలని విద్యార్థులకు సూచించారు. పరిశుభ్రమైన పాఠశాల, పరిశుభ్రమైన పట్టణ నిర్మాణానికి తొలి అడుగని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, జూన్ 25, ప్రభాతవార్త:



మండలంలో ఇటీవల చక్రాయపేట మండలంలో పాపాఘ్ని నదిలో లోకేష్‌రెడ్డి కొడుకులు నదిలో పడి మృతి చెందడంతో గురువారం కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని ఆయనకు భరోసా ఇచ్చారు. ఇద్దరు కుమారులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నాయకుడు కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సర్‌పై విస్తృత స్థాయి సమావేశం



సిద్ధవటం జూన్ 25 ప్రభాతవార్త

ఇంటింటికి ఎన్యుమరేషన్ ఫారాలు అందేటట్లు టిడిపి పార్టీ బిఎల్ఏ లు కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజ్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్ధవటంలోని టిడిపి కార్యాలయంలో బిఎల్ఏ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 14లోపల ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసి అధికారులకు అందించాలని కొన్నిచోట్ల బిఎల్‌వోలపైన ఫిర్యాదులు అందుతున్నాయని అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని గ్రామస్థాయి నుండి ప్రతి ఓటర్ను గుర్తించి ఆన్లైన్లో నమోదు చేసే విధంగా కృషి చేయాలని వైసిపి పార్టీ బిఎల్ఓల పైన జాగ్రత్త వహించాలని గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలు చాలా ఉన్నాయని ఓటర్ల లిస్టులోఓటు హక్కు కలిగిన ఓటరు గ్రామంలోని ఉండాలని గత ప్రభుత్వంలో కొన్ని వ్యవస్థలను అడ్డబెట్టుకొని ఓటర్ లిస్టులో గ్రామాలకి ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు కూడా ఓటర్ లిస్టులో చేర్పులు చేశారని అలాంటి వారిని గుర్తించి తొలగించేందుకు కృషి చేయాలని తెలిపారు. రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమాలు రెట్టింపు చేశామని గత వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి ఒక తట్టెడు మట్టి కూడా వేయలేదని ఏపీ రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఇతర విదేశాల నుండి పెట్టుబడులు తీసుకొచ్చారని ఫేక్ , గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నామని దొంగ ఓట్ల మాఫియాకు సర్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు అనంతరం తాసిల్దార్ కార్యాలయంకు వెళ్లి తాసిల్దార్ విజయ్ కుమార్‌తో సర్ గురించి మాట్లాడినారు ఏమైనా దొంగ ఓట్లు ఉంటే వాటిని గుర్తించి వాటిని తొలగించాలని ఆయన తెలియజేశారు మరియు డీలర్లు కొంతమంది వికలాంగులకు వయోవృద్ధులకు వారి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ ఇవ్వడంలేదని నా దృష్టికి వచ్చినవి అలాంటి డీలర్ల పై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ విజయ్ కుమార్ కు తెలిపారు కార్యక్రమంలో టిడిపి అబ్జర్వర్ చిట్టిబాబు, మండల టిడిపి అధ్యక్షులు రాజశేఖర్ సింగిల్ విండో అధ్యక్షులు దశరథ నాయుడు క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు, నిత్య పూజ స్వామి ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి మాజీ జెడ్పిటిసి చలమయ్య, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి, సిద్ధవటం మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య టిడిపి మండల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు చెంచయ్య నాయుడు, లింగంపల్లిమాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి రాంప్రసాద్ నాగభూషణం,ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు, మాజీ సర్పంచులు బూత్ కమిటీ మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీర్ల పండగలో పాల్గొన్న స్టేట్ డైరెక్టర్



సిద్ధవటం జూలై 25 ప్రభాతవార్త

మండలంలోని మండపంపల్లె గ్రామపంచాయతీలోని అచ్చంపేట గ్రామంలో బాదుల్లా పీర్ మరియు కాశీం పీర్ల ఫాతిహా సదింపులు కార్యక్రమంలో పాల్గొన్న ఏపి స్టేట్ నూరు భాష దూదేకుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆ దేవున్ని కోరుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి సాలాబాద్ బుజ్జయ్య, మండపం పల్లె ఎంపీటీసీ కరమళ్ళ భాష వారు ఏర్పాటు చేసిన ఉచిత భోజన వసతి కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి సాలాబాదు బుజ్జి మట్టపంపల్లి ఎంపీటీసీ కరమళ్ళ భాష తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా కుంభాభిషేక ఉత్సవాలు






రాజంపేట, జూన్ 25 ప్రభాతవార్త

రాజంపేట అమ్మవారి శాల ప్రారంభమై 125 వసంతాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా కుంభాభిషేక ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మహా గణపతి పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. స్వస్తివాచకం, గోపూజ ,కలశ స్థాపన, అగ్ని ప్రతిష్టాపన, లక్ష్మీ గణపతి హోమం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, చండీ పారాయణం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వాసవి మాత మూలమూర్తికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.

## ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టడం సరికాదు

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 25 ప్రభాతవార్త

జమ్మలమడుగు జనసేన నాయకుడు నల్లంశెట్టి నాగార్జున స్థానిక శ్రీనివాస నగర్ లోని జనసేన కార్యాలయం లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి చేస్తామని ప్రజలను మరోసారి నమ్మించే ప్రయత్నం చేయాలని, విమర్శల కంటే ఆత్మపరిశీలన అవసరమని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి సూచించారు. పవన్ కళ్యాణ్‌పై మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని హితవు పలికారు. ఎమ్మెల్యే పంతం నానాజీ కోసం కాకినాడ వెళ్లాల్సిన అవసరం లేదని, కడప జిల్లాలోని జనసైనికులే సమాధానం చెబుతారని అన్నారు. ప్రాంతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. జనసేన ప్రొద్దుటూరు నాయకుడు మంచి శివకుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతిపక్ష నేతలపై చేసిన వ్యాఖ్యలు, అనుసరించిన వైఖరిని గుర్తు చేసుకోవాలని సూచించారు. సంస్కారం గురించి మాట్లాడే ముందు అప్పటి మంత్రులు, నేతలు చేసిన వ్యాఖ్యలను పరిశీలించాలని అన్నారు. ప్రజా వేదికలపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయాలకు మంచిది కాదన్నారు. కడప పార్లమెంటు సమాచార సేకరణ కమిటీలో ప్రొద్దుటూరు నుంచి ఎంపికైన మాదాసు మురళీ, విజయ కుమార్, రామారావు, జిలానీకి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కడప జిల్లాను చిన్నచూపు చూసే పరిస్థితులు మారుతున్న తరుణంలో మళ్లీ పాత రాజకీయాలను గుర్తు చేసేలా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. జగన్ ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర నాయకులకు నమస్కరిస్తారని, అదే సమయంలో ఢిల్లీని వణికించామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చారని, ఓటమి కారణాలను విశ్లేషించుకోవడం మంచిదన్నారు. పంతం నానాజీ వృద్ధాప్యంలో ఎమ్మెల్యే అయ్యారని వ్యాఖ్యానించడం కూడా తగదని చెప్పారు. రాచమల్లు రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం పొందినా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత ఆక్రోశంతో మాట్లాడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు పునరావృతం చేయడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యులు రామారావు, మాదాసు మురళీ, బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యులు రామోజీ ప్రసాద్, మంచాల సంజీవ్, బాబ్జీ, నాగముని, శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకులు మంచి శివకుమార్

## చెయ్యాలి చెల్లి పెళ్లి మళ్లీ మళ్లీ

వేంపల్లి జూన్ 25 ప్రభాతవార్త



చెయ్యాలి చెల్లి పెళ్లి మళ్లీ మళ్లీ అన్నట్లుంది కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మాణం విషయమని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డా.నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. కడప జిల్లా రాయలసీమ నిరుద్యోగుల కలలు కలలుగానే మిగిలిపోయాయి. కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పడితే చాలా మేరకు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని యువత భావించారు. కానీ అది కలగానే మిగిలిపోయింది ఇప్పటికీ నాలుగు సార్లు శంకుస్థాపన చేయడం జరిగింది

## ఎమెర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం



వేంపల్లి జూన్ 25 ప్రభాతవార్త

ప్రజాస్వామ్య దేశంలో ఎమెర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం అని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ అన్నారు.ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన జనసంఘ్ నాయకుడు బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఎమర్జెన్సీ విధించి నేటికీ 51 సంవత్సరాలు అయిన సందర్భంగా భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ, పౌరుల కనీస హక్కులను కాలరాస్తూ నాటి ప్రధాని ఇందిరా గాంధీ 1975 జూన్ 25 సాయంత్రం దేశంలో ఎమెర్జెన్సీ విధించింది. అని అన్నారు. ఈ ఎమెర్జెన్సీ దాదాపు 21 నెలల పాటు కొనసాగి 1977 మార్చి 21 వరకు అమల్లో ఉంది. ఈ కాలంలో ప్రజాస్వామ్యవాదులెందరినో నాటి ప్రభుత్వం జైల్లో పెట్టింది.. ప్రజల ప్రాథమిక స్వేచ్ఛను కబళించి, వారి మానవ హక్కులను తుంగలో తొక్కింది.. ప్రసార మాధ్యమాల గొంతు నొక్కడం తోపాటు రాజకీయ ప్రత్యర్థులను, పాత్రికేయులను జైళ్లలో పెట్టారు. తమ హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారన్నారు. దేశం పోలీసు రాజ్యంగా మారిందని అన్నారు. నాటి కాంగ్రెస్ దూరగతాలను నేటి తరానికి తెలియజేసి ప్రజాస్వామ్యం గొప్పదనాన్ని చాటేందుకే జూన్ 25న ప్రజాస్వామికవాదులు 'ఎమెర్జెన్సీ వ్యతిరేక దినం'గా పాటిస్తున్నారు. ఎమెర్జెన్సీ కాలంలో బయటకు కనపడని అమానవీయ అణచివేత ఘటనలు ఎన్నో జరిగాయన్నారు ,ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడిన వారందరికీ జోహార్లు. తెలియజేస్తున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె రామచంద్రారెడ్డి,బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, విశ్వనాథ రెడ్డి, దశరధ,కార్తీక్, నారాయణ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కడప పార్లమెంటు సమాచార సేకరణ
## కమిటీ సభ్యుడిగా ఆలూరు ముని జగదీష్ బాబు

పులివెందుల, జూన్ 25, ప్రభాత వార్త :



కడప పార్లమెంటు సమాచార సేకరణ కమిటీ సభ్యుడిగా పులివెందులకు చెందిన జనసేన పార్టీ నాయకులు ఆలూరు ముని జగదీష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం నుంచి బుధవారం అధికారికంగా నియామక ఉత్తర్వులు అందాయి.ఈ సందర్భంగా జగదీష్ బాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని అన్నారు. పార్టీ కార్యక్రమా లను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కడప పార్లమెంటు పరిధిలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.తనకు ఈ అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు,కడప జిల్లా పార్లమెంటు అబ్జర్వర్ సి. మధుసూదన్ రెడ్డి, అలాగే జిల్లా జనసేన నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలూరు ముని జగదీష్ బాబు నియామకం పట్ల జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఆయన అందిస్తున్న సేవలను నాయకులు అభినందించారు.

## 50వ గణపతి మహోత్సవం సందర్భంగా కర్ర పూజ



ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 25 ప్రభాతవార్త

స్థానిక శివాలయం శ్రీ గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 50వ గణపతి మహోత్సవాలను పురస్కరించుకొని మహాగణపతి ప్రతిష్ఠకు నాందిగా గురువారం కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 అడుగుల శివలింగం ఆకృతిలో ప్రత్యేక సెట్టింగ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కళాత్మక నిర్మాణ పనుల కోసం ఒంగోలు నుంచి ప్రత్యేకంగా కళాకారులు వచ్చి పనులు ప్రారంభించారు. రాయలసీమ వ్యాప్తంగా ఈ తరహాలో 50 సంవత్సరాల పాటు ఉత్సవాలు నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహోత్సవాల ఏర్పాట్లలో భాగంగా భక్తిశ్రద్ధలతో వాతావరణం ఆధ్యాత్మికంగా మారింది.

## కేబుల్ లైన్ కోసం తవ్విన గుంత పూడ్చర

ప్రమాదాల బారిన పడుతున్న పాదచారులు, వాహనదారులు

ఖాజీపేట జూన్25, ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఖాజీపేట బస్టాండ్ లో ప్రధాన రహదారిపై తవ్విన గుంత వాహనదారులు, పాదచారులకు నరకం చూపుతోంది. ఎయిర్‌టెల్ నెట్ కేబుల్ లైన్ ఏర్పాటు కోసం రహదారిపై గుంత తవ్వి, పనులు పూర్తయిన తర్వాత దాన్ని పూడ్చకుండా అలాగే వదిలేశారు. నిత్యం వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు మరియు ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ బస్టాండ్ ప్రాంతంలో ఈ గుంత పెద్ద ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఈ గుంత కనిపించక ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. పాదచారులు సైతం నడుచుకుంటూ వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టర్ స్పందించి, తక్షణమే ఈ గుంతను పూర్తిగా పూడ్చి, రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



## ప్రతి బిడ్డకు రెండు చుక్కలు జీవితానికి భరోసా



పోలియో చుక్కలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పీలేరు జూన్ 25 ప్రభాతవార్త:**

ప్రతి బిడ్డకు రెండు చుక్కలతో పోలియో రహిత సమాజాన్ని అశిద్దామని తలుపుల ప్రధాన వైద్య అధికారులు శ్రీ గిరిష చంద్రశేఖర్ సంయుక్తంగా అన్నారు. 28 ఆదివారం జరగబోయే జాతీయ పోలియో టీకా దినోత్సవం జయప్రదం చేయుటలో భాగంగా పి.హెచ్.సి తలపులలో మరియు పిలేరులో అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం రెండు విడతాలుగా వ్యాక్సినేటర్స్ కి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గతంలో పోలియో చుక్కలు వేయించినా, వేయించకపోయిననూ, ఇక ముందు పోలియో బారిన పడకుండా పిల్లలకు అదనపు రక్షణ కల్పించడానికి మరియు దేశాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దడానికి 28 ఆదివారంనాడు, 0 5 సంవత్సరాలలోపు ప్రతి బిడ్డకు రెండు పోలియో చుక్కలు వేయించాలని డా:శ్రీగిరిష అన్నారు, టీకా వేసేటప్పుడు కచ్చితంగా పిల్లల యొక్క కుటుంబ సభ్యులు ఒకరు ఉండాలని, బూత్‌లో, గృహదర్శన విధులలో ఎవరికి కేటాయించిన విధులు వాళ్ళు సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డా చంద్రశేఖర్ వాక్స్ నేటర్స్ కి విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ ఇఒ కొండయ్య, పి.హెచ్.యన్ కుసుమ, పర్యవేక్షకులు నాగమ్మ ఉమ, రెడ్డెప్ప,ఏ యన్ఎంలు, సిహెచ్ఓలు ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటరీస్, పాల్గొన్నారు.

## మండల సమాఖ్యలు బలోపేతానికి సహకరించండి



**తంబళ్లపల్లె జూన్ 25 ప్రభాతవార్త :**

మండలంలోని గ్రామ సమాఖ్యలు హాలో పేతమై తద్వారా మహిళా సంఘాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని ఏపిఎం గంగాధర్ సూచించారు. గురువారం వెలుగు కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షురాలు రామ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో మండల సమైక్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత ఏడాది లో మహిళా సంఘాలు ఎస్ హెచ్ జి, పొదుపు,శ్రీనిధి,ఉన్నతి రుణాలతో ఆర్థిక అభివృద్ధి సాధించి సత్ఫలితాలు రాబట్టామని భవిష్యత్తులో మహిళా సంఘాలు రుణ సౌకర్యంతో వినూత్న మినీవ్యాపారాలు, వెదురు పెంపకం, పలు రకాల వ్యాపారాల పై దృష్టి సారించాలని అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువులు, కషాయాల వాడకంతో పండించిన పంటలతో పర్యావరణంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సిసిలు, కత్తి నరసింహులు, రమణ, ఆదిలక్ష్మి, మండల సమైక్య సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఉలిమెళ్ల లేక్ ఫ్రంట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

### లైటింగ్, సౌకర్యాల మెరుగుదలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచన : శిల్పారామం సీఈవో స్వామి నాయుడు

**పులివెందుల, జూన్ 25, ప్రభాతవార్త :**

పులివెందులలోని డాక్టర్ వైఎస్సార్ ఉలిమెళ్ల లేక్ ఫ్రంట్‌ను ఏపీ శిల్పారామం, విజయవాడ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. స్వామి నాయుడు గురువారం సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలించారు. లేక్ ఫ్రంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పచ్చిక బయళ్లను (లాన్లను) చక్కగా నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా లేక్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి. విశ్వనాథరెడ్డి పలు అంశాలను సీఈవో దృష్టికి తీసుకువచ్చారు. సౌండ్ సిస్టం మరమ్మతులు, స్ప్రింక్లర్లు, ఎలక్ట్రికల్ కేబుల్స్, లైటింగ్ వ్యవస్థ, వాటర్ ప్లాంట్ తదితర అవసరాలను వివరించారు. వీటికి సంబంధించి ఎస్టిమేట్లు సిద్ధం చేసి పంపించాలని స్వామి నాయుడు సూచించారు.పనిచేయని లైట్లను మరమ్మతు చేయించి రాత్రి వేళల్లో సందర్శకులకు మెరుగైన వెలుతురు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వారాంతంలో తప్పనిసరిగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, చైల్డ్ ప్లే ఏరియాలో అవసరమైన మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వి. స్వామినాయుడు మాట్లాడుతూ పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఛైర్‌పర్సన్ సి. మంజుల రెడ్డి సహకారంతో డాక్టర్ వైఎస్సార్ ఉలిమెళ్ల లేక్ ఫ్రంట్‌లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సందర్శకుల సంఖ్య పెంచడంతో పాటు లేక్ ఫ్రంట్‌ను మరింత ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శిల్పారామం ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. స్వామి నాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి. విశ్వనాథరెడ్డి, డాక్టర్ వైఎస్సార్ ఉలిమెళ్ల లేక్ ఫ్రంట్ సిబ్బంది పాల్గొన్నారు.



పచ్చిక బయళ్లను పరిశీలిస్తున్న శిల్పారామం కారనిర్వాహ నాధికారి స్వామి

## వైష్ణో దేవి ఆలయంలో చండీ హోమం

### లోక కళ్యాణం కోసం విశేష పూజలు



వైష్ణవి దేవి ఆలయంలో జరుగుతున్న చండీ హోమం

**చౌడేపల్లి జూన్ 25 ప్రభాతవార్త**

లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ, విశ్వశాంతి, మానవాళి ఆరోగ్య రక్షణే ధ్యేయంగా శ్రీ మాతా వైష్ణో దేవికీ విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యంగా ఆలయం ముందు వేద పండితుల ఆధ్వర్యంలో చండీ హోమాన్ని సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అంతేకాకుండా మహిళా భక్తులచే ఆనందలహరి కార్యక్రమం జరిగింది. అనంతరం అమ్మవారికి ప్రధాన అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో విశేష అభిషేకము అలంకరణ గావించారు. చండీ హోమంలో పాల్గొన్న భక్తులతో పాటు లోక కళ్యాణం కోసం నిర్వహించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు నిర్వాహకులు ఉచిత భోజన వసతి కల్పించారు. అంతేకాకుండా అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

# బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకొని ఎదగాలి

**రాజంపేట, జూన్ 25 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ అందజేసే రుణాలను లబ్ధిదారులు, రుణ గ్రహీతలు, పొదుపు సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని బ్యాంక్ జనరల్ మేనేజర్ మహమ్మద్ రియాజ్ కోరారు. గురువారం రాజంపేట ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో భారీ రుణ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్యాంక్ జనరల్ మేనేజర్ మహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ ఎవరిపై అయినా బ్యాంకులు నమ్మకంతోనే రుణాలు ఇస్తాయన్నారు. ఆ రుణాలను సక్రమంగా వినియోగించుకుని వ్యాపార పరంగా అభివృద్ధి చెందినప్పుడు బాగుపడతారన్నారు. అంతే కాకుండా మరికొందరికి రుణాలు ఇచ్చేందుకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు.అందుకే రుణం తీసుకున్న ప్రతి ఒక్కరు సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ బి. రాఘవేంద్ర, రాజంపేట ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ రాజేష్, చిట్వేల్ చీఫ్ మేనేజర్ శ్రీనివాసులు, పుల్లంపేట, పెనగలూరు, వత్తలూరు, ఆర్ఎస్ రోడ్ రాజంపేట, రైల్వే కోడూరు, మంగంపేట శాఖల బ్యాంక్ మేనేజర్లు, రీజినల్ ఆఫీస్ సిబ్బంది, సిపిసి సిబ్బందితో పాటు బ్యాంక్ ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఐదు కోట్ల రూపాయల రుణాల రూపంలో అందజేశారు. అలాగే బ్యాంక్ ఖాతాదారులకు ఆటో, వ్యాపార, గృహరుణాల విభాగాలలో కూడా రుణాలను పంపిణీ చేశారు.



చెక్ అందజేస్తున్న గ్రామీణ బ్యాంక్ జిఎం మహమ్మద్ రియాజ్, జడ్ఎం రాఘవేంద్ర

## నాణ్యమైన విద్యతో పాటు స్కాలర్ షిప్‌లు అందిస్తాం

**వాల్మీకిపురం, జూన్ 25 ప్రభాతవార్త :**

స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో విశాలమైన తరగతి గదులు, అధునాతన సౌకర్యాలతో పాటు పచ్చదనం లాంటి సౌకర్యాలతో కార్పొరేట్ కళాశాలలతో దీటుగా ఇక్కడ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు స్కాలర్షిప్లు అందించడం జరుగుతుందని స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ విక్టోరియారాణి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్థానిక కళాశాలలో అర్హత ఉన్న బోధన సిబ్బంది, మంచి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అవకాశాలను అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఇలాంటి అవకాశాలను గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే తమ బోధన, బోధనేతర సిబ్బంది వాల్మీకిపురంతో పాటు పరిసర గ్రామాలకు వెళ్తున్నారని, ఇంటింటికి వెళ్లి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, స్కాలర్ షిప్పు, సౌకర్యాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## పిడుగుపల్లిశంకవరం మధ్య రోడ్డు ప్రమాదం

**కలసపాడు, జూన్ 25 ప్రభాత వార్త:**

పిడుగుపల్లిశంకవరం మధ్య గురువారం కారు ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలోని నలుగురికి తీవ్ర గాయాలయ్యా యి. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు కాగా ఆటో పల్టీలు కొట్టగా కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. స్థానికులు స్పందించి క్షతగాత్రులను వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొందరు పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్ కు తరలించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పోలియో రహిత భారతమే లక్ష్యం



**పులివెందుల, జూన్ 25, ప్రభాత వార్త :**

దేశవ్యాప్తంగా జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యులు డాక్టర్ శాంత కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. జననం నుంచి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. పల్స్ పోలియోపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పులివెందుల పట్టణంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంత కుమార్ మాట్లాడుతూ పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని సమీపంలోని పోలియో కేంద్రాలకు వెళ్లి చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ అధికారి సతీష్ కుమార్, ఏఎన్ఎం సూపర్వైజర్ కృష్ణవేణి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్‌తో పాటు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీ ద్వారా ప్రజలకు పోలియో చుక్కల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

## మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ



**వేంపల్లి జూన్ 25 ప్రభాతవార్త**

వేంపల్లి మండల కేంద్రంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను గురువారం శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులు, విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. నేరుగా విద్యార్థినులతో మాట్లాడిన ఎమ్మెల్సీ, వారికి అందుతున్న వసతులు మరియు భోజన నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం వంటగదిని, స్టోర్ రూమ్‌ను పరిశీలించిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పాలు, కోడిగుడ్లు పంపిణీ చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వంటకు ఉపయోగిస్తున్న కూరగాయల నాణ్యత లోపించడంపై పాఠశాల సిబ్బందిని మందలించారు.విద్యార్థుల ఆరోగ్యం మరియు ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్సీ గారు వెంటనే ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి, మెనూ పాటించని సంబంధిత బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యా, వైద్య సదుపాయాలతో పాటు పౌష్టికాహారం అందించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జీవీ రమణ, కోనేటి మహేష్ మరియు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం

**వేంపల్లి జూన్ 25 ప్రభాతవార్త**

యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, సమాజాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వేంపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి. నరసింహులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "సే నో టు డ్రగ్స్" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటిని నివారించే మార్గాలు, యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ టి.నరసింహులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల ప్రలోభాలకు లోనుకాకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాలు విక్రయించడం, కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలు చట్టరీత్యా నేరమని, అలాంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా, తమ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలు, రవాణా లేదా అనుమానాస్పద వ్యక్తుల సంచారం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులే సమాజానికి మార్గదర్శకులుగా నిలిచి మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు




**బద్వేలు, జూన్ 25, ప్రభాతవార్త**

బద్వేల్ నియోజకవర్గం లోని గోపవరం మండల పరిధిలోని ప్రభుత్వ భూములను రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గోపవరం గ్రామంలోని సర్వే నంబర్లు 1983/1, 1984/1లో ఉన్న 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దార్ జీవన్ తెలిపారు. అదేవిధంగా గోపవరం గ్రామంలోని సర్వే నంబర్లు 1848, 1852లో ఉన్న 80 సెంట్ల ప్రభుత్వ భూమితో పాటు, సర్వే నంబర్ 1852లోని మరో ఒకటిన్నర ఎకరాల ప్రభుత్వ భూమిలో కూడా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ బోర్డులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

## కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు రెండేళ్లు..

### - కడప జిల్లా తెదేపా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి

**జమ్మలమడుగు, జూన్ 25, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో కడప జిల్లా తెదేపా అధ్యక్షులు భూపేష్‌రెడ్డి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వ సుపరిపాలన రెండేళ్ల పరిపాలన విజయోత్సవ సభ నిర్వహించామన్నారు. చెప్పిన విధంగా సూపర్ సిక్స్ అమలు చేయడం జరిగిందన్నారు. అరాచకాలతో ప్రజలు విసిగిపోయి కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించారన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రంగాన్ని గాలికి వదిలేశారని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలు అందించామన్నారు. వైకాపా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడిన మాటలు హాస్యాస్పదమన్నారు. మీ నాయకుడు రప్పా రప్పా అంటే ఖండించరా అంటూ ప్రశ్నించారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఏం అభివృద్ధి చేశారో తెలపాలన్నారు. ఎవరి మెప్పు కోసం ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. 1994లో గుండ్లకుంటలో 6వేల ఓట్లున్నాయి. 2024 వచ్చేసరికి వెయ్యి ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. 1999లో మీరు గెలిచింది బోగస్ ఓట్లతో అన్నారు. యువత గత చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. సంక్షేమం ఒక వైపు, అభివృద్ధి మరో వైపు చేస్తుంటే మీకు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వారిని తప్పుదావ పట్టించలేరని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా తెదేపా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి గురప్ప, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ మల్లికార్జున, రామాంజనేయులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన గోడౌన్‌ల యజమానులు

**దువ్వూరు, జూన్ 25, ప్రభాతవార్త:**

నియోజకవర్గంలోని వేర్ హౌస్ గోడౌన్‌ల యజమానులు గురువారం హైదరాబాదులో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను కలిశారు. దువ్వూరు, ఖాజీపేట, చాపాడు మండలాలకు చెందిన గోడౌన్ యజమానులు ఎమ్మెల్యేను కలిసి గోడౌన్ల సమస్యలను ఆయనకు వివరించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోడౌన్ ల యజమానులు రైతులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు గోదాములు జరుపుకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది ఉండరాదని, గోడౌన్ లకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉంచుకుంటే రైతులకు ప్రయోజకరంగా ఉంటుందని, ఆ దిశగా ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సురేష్, రామ్మోహన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కరీముల్లా, షేక్ మున్ని, సుధీర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి



**ఖాజీపేట, జూన్ 25, ప్రభాతవార్త**

మండల పరిధిలో మొహరం వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, అత్యంత ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా జరుపుకోవాలని ఖాజీపేట సీఐ వంశీధర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని అన్ని మతాల పెద్దలు, ప్రముఖులు, ఉత్సవ నిర్వాహకులతో కలిసి ప్రత్యేక శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వంశీధర్ మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలన్నారు. వేడుకల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎలాంటి సమస్యాత్మక పరిస్థితి తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పండుగను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పోలీసు సిబ్బందికి పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాజీపేట పోలీస్ సిబ్బంది, పీస్ కమిటీ సభ్యులు, ముస్లిం, హిందూ మత పెద్దలు, పాల్గొన్నారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల్లో ఆనందం

**ప్రొద్దుటూరు అర్బన్,జూన్ 25, ప్రభాత వార్త**

పాత పెన్షన్ (ఓపీఎస్) అమలుకు మార్గం సుగమం కావడంతో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరులోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో అభినందన సభ నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ, ఈ నిర్ణయానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా ఈ సాధనపై హర్షం వ్యక్త్యం చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని పాత పెన్షన్ సాధనలో భాగస్వాములైన వారిని అభినందించారు.



# ముగిసిన మాజీ మాజీ సీఎం జగన్ పర్యటన

### ప్రజా దర్బార్‌లో ప్రజలు, కార్యకర్తల సమస్యలు తెలుసుకున్న వైఎస్ జగన్

**పులివెందుల, జూన్ 25, ప్రభాతవార్త :**

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పులివెందుల పర్యటన గురువారం ముగిసింది. మంగళవారం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 4 గంటలకు పులివెందుల చేరుకున్న వైఎస్ జగన్ ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుధవారం వేముల మండలం భూమయ్య గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ నరసింహ స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పులివెందుల పట్టణంలో ఎంపీ నిధులతో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన మూడు సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. తదుపరి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన



ప్రజా దర్బార్‌లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు, అభివృద్ధి అంశాలపై వివరాలు సేకరించారు. గురువారం ఉదయం ముఖ్య నేతలతో సమావేశమైన వైఎస్ జగన్ జిల్లా సమస్యలు, నియోజకవర్గ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఉదయం 8 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.మూడు రోజుల పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు తెలుసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 25, ప్రభాతవార్త:**

బాలసాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి.కె.చదువుల బాబు, సంస్థ కార్యదర్శి నేషనల్ రికార్డు హోల్డర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు గజ్జల వెంకటేశ్వరరెడ్డి ప్రొద్దుటూరులోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయానికి వందకు పైగా పుస్తకాలను అందజేశారు. వీటిలో కథ, కవిత్వం, పద్య సంపుటాలు, ఆధ్యాత్మిక రచనలు, యాత్రా రచనలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు గోపీనాథరెడ్డి, పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యం, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వేణుగోపాల్‌రెడ్డి, కళాభారతి నాటక కళా సంస్థ అధ్యక్షులు కొత్తపల్లి శీను, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్, కొండయ్య, పీఆర్‌టీయూ ప్రతినిధులు రమణ, యూటీఎఫ్ ప్రతినిధులు నీలం కంబగిరి, గ్రంథాలయం ప్రస్తుత బాధ్యులు నాగలక్ష్మి దేవి, పాఠకులు పాల్గొన్నారు.